


ఎంఎల్ఎ రోషన్‌చే పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో చింతలపూడి ఎఎంసి ఛైర్‌పర్సన్ చీదరాల దుర్గాపార్వతి, వైస్ ఛైర్మన్ మారిశెట్టి సత్యనారాయణ, టిడిపి పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ

చెలరేగుతున్న సైబర్ నేరగాళ్లు..!



అధికారులు, ప్రముఖులే టార్గెట్‌గా ఉచ్చు

మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్ ఘటనతో మరోసారి చర్చనీయాంశం

ప్రజాశక్తి - నరసాపురం

సైబర్ నేరగాళ్లు చెగలరేగిపోతున్నారు. గతంలో పోలీసులమంటూ భయపెట్టి నగదు దోచేసిన ఘటనలు ఈ ప్రాంతంలో చోటుచేసుకున్నాయి. మొగల్తూరు తదితర పోలీస్ స్టేషన్లో కేసులు సైతం నమోదయ్యాయి. దీనిపై జాగ్రత్తగా ఉండాలని, ఎటువంటి బెదిరంపులకూ తలొగ్గకుండా తమకు సమాచారం ఇవ్వాలని పోలీసులు పదేపదే ప్రకటిస్తున్నా విద్యావంతులైన అధికారులే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడుతుండటం గమనార్హం.

2024 అక్టోబర్ 24న మొగల్తూరులోని పలువురు వ్యాపారులకు పోలీసులు అంటూ ఫోన్ చేసి భయ పెట్టి సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడ్డారు. ఎస్ఐ కుటుంబ సభ్యులు అనారోగ్యానికి గురయ్యారని, తాను ఎస్ఐ భాస్కర్‌రెడ్డిని అని, తాను తెలిపిన నెంబర్‌కు ఫోన్‌పే ద్వారా నగదును బదిలీ చేయాలని కోరడం అందరికీ తెలిసిందే. దీంతో ఒక వ్యాపారి వారు చెప్పిన నెంబరుకు రూ.60 వేల నగదు బదిలీ చేసి, ఆపై మోసపోయామని గుర్తించడంతో విషయం వెలుగుచూసింది.

ఈ ఏడాది మే ఐదో తేదీన మొగల్తూరు తహశీల్దార్ రాజ్‌కిషోర్‌ను సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించే ప్రయత్నం చేశారు. తాను ఐఎఎస్ అధికారిని అంటూ గుర్తు తెలియని వ్యక్తి తహశీల్దార్‌కు ఫోన్ చేసి తన బంధువు స్థానిక పిహెచ్‌సి వద్ద ఉన్నాడని, అతనికి అత్యవసరంగా డబ్బులు అవసరమని, ఫోన్ నెంబర్ ఇచ్చి నగదు ఇవ్వాలని సూచించాడు. తహశీల్దార్ ఆ నెంబర్‌కు కాల్ చేసి డబ్బు తీసుకొస్తున్నా అని చెప్పగా ఆ వ్యక్తి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు.



మొగల్తూరు పోలీస్ స్టేషన్

తాజాగా మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసును ఎసిబి అధికారులమని నమ్మించి డబ్బులు డిమాండ్ చేశారు. అది నమ్మి సబ్ రిజిస్ట్రార్ రూ.2 లక్షలు నగదు బదిలీ చేసి మోసపోయాడు. అయితే తర్వాత కూడా డబ్బు డిమాండ్ చేయడంతో తాను మోసపోయానని నిర్ధారించుకుని, చివరకు మొగల్తూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

తాజాగా ఈ నెల 12వ తేదీన మొగల్తూరు తహశీల్దార్ తన విధులు ముగించుకుని ఇంటికెళ్లేందుకు సిద్ధమవుతుండగా సిసిఎల్ఎ కమిషనర్ కార్యాలయం నుండి మాట్లాడుతున్నాం అంటూ ఒకరు ఫోన్ చేశారు. పైఅధికారి కార్యాలయం నుండి కాల్ అనడంతో తహశీల్దార్ రాజ్‌కిషోర్ వారడిగిన ప్రశ్నలకు మర్యాద పూర్వకంగా సమాధానం ఇచ్చారు. మే నెలలో ఇలాంటి కాల్ తహశీల్దార్‌కు వచ్చి ఉండటంతో ఆయన అప్రమత్తమై ఫేక్ కాల్ గా గుర్తించి మాట్లాడారు.

సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న జిల్లా వాసులు

ఈ నెల ఏడో తేదీన విశాఖపట్నం ఎండాడ ప్రాంతంలో అంతర్జాతీయ సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలు ఇచ్చి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరిస్తున్న పది మంది వ్యక్తులను సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో జిల్లాకు చెందిన కొవ్వలి వాసి కోదండ రామాంజనేయులు, భీమవరానికి చెందిన తోటకూర రాజకుమార్, నరసాపురానికి చెందిన మొహమ్మద్ గౌస్ షరీఫ్, మొగల్తూరు మండలం రామన్నపాలెంవాసి మైలాబత్తుల పవన్, కాళ్ల మండలం పెదఅమిరానికి చెందిన పెన్మెత్స ప్రసాదరాజు, విశాఖకు చెందిన కెవివి.నరేష్, తూర్పుగోదావరి జిల్లావాసి కె.శివవర్మలను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

డిఎస్‌పి డాక్టర్ శ్రీవేద



సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ప్రజలకు ఫోన్ చేసి పోలీసులు అని డబ్బులు అడిగితే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వండి. సైబర్ మోసానికి గురైన బాధితులు 24 గంటల్లోపు 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలి. సకాలంలో ఫిర్యాదు చేస్తే డబ్బులు రికవరీ చేసే అవకాశం ఉంది. బ్యాంకు అధికారులు, డిజిటల్ అరెస్టులు, పార్ట్ టైమ్ జాబ్స్, కస్టమర్ కేర్ ప్రతినిధులుగా మాట్లాడి మీతోనే మీ ఆన్‌లైన్ బ్యాంకింగ్, ఇ-వ్యాలెట్ ఓటీపీలు, యుపిఐ నెంబర్లు అని కాల్ చేసే వారి వలలో చిక్కుకోవద్దు. డిజిటల్ అరెస్టు అనే బెదిరింపులకు భయపడొద్దు. సోషల్ మీడియాలో వచ్చే రీల్స్, ప్రకటనలు వాట్సాప్‌లో వచ్చే లింకులను చూసి పెట్టుబడులు పెట్టొద్దు. అనుమతి లేకుండా ఎవరైనా వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపుల్లో ఎవరైనా చేరిస్తే వెంటనే లెఫ్ట్ కావాలి.

నాణ్యమైన భోజనం అందించకపోతే చర్యలు

మధ్యాహ్న భోజన నాణ్యతను పర్యవేక్షించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే

మెనూ అమలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

అధికారులతో కలెక్టర్ కె.వెట్రిసెల్వి



మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించని ఏజెన్సీలపై, సక్రమంగా పర్యవేక్షించని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటానని కలెక్టర్ కె.వెట్రిసెల్వి హెచ్చరించారు. పాఠశాలలు, వసతి గృహాలు, అంగన్వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజన పథకం అమలుపై సంబంధిత శాఖల అధికారులు, ఎంఇఒలతో శుక్రవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ విద్యార్థుల్లో పౌష్టికాహార లోపం లేకుండా ఉండేలా ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తుందని, అటువంటి పథకాన్ని సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, అంగన్వాడీ కేంద్రాలలో నిర్దేశించిన మెనూ ప్రకారమే భోజనం అందించాలన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడొద్దని, నాణ్యమైన బియ్యం, కూరగాయలు, ఆహార తయారీ పదార్థాలు నాణ్యతో ఉండేలా చూడాలని, భోజనం తప్పనిసరిగా పూర్తి శుచి, రుచిగా ఉండాలన్నారు. కొన్ని పాఠశాలల్లో భోజనం రుచిగా లేని కారణంగా కొంతమంది విద్యార్థులు భోజనం స్వీకరించడం లేదని, అందుకు కారణాలు, లోపాలను గుర్తించి నూరుశాతం విద్యార్థులు భోజనం స్వీకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నాణ్యమైన బియ్యం మాత్రమే వినియోగించాలని, భోజనం తయారీ పదార్థాలు పరిశీలించాలని, ఏజెన్సీ వారు రుచిగా వండేలా చూడాలని, లేనిపక్షంలో ఏజెన్సీని మార్చాలన్నారు. మధ్యాహ్న భోజనానికి వినియోగించే బియ్యం పక్కదారి పట్టకుండా చూడాలని, మధ్యాహ్న భోజనం తయారీ కిచెన్, వంట పాత్రలు పరిశుభ్రంగా ఉండాలని, ఎంఇఒలు తరచూ మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి, నాణ్యత సక్రమంగాలేని వాటిపై నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. పాఠశాలలపై సక్రమ పర్యవేక్షణ లేని, తనిఖీలు నిర్వహించని మునునూరు, పెదవేగి, పెదపాడు, ఉంగుటూరు ఎంఇఒలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలనీ కలెక్టర్ డీఈఓ ని ఆదేశించారు. ఇటీవల ఆహార కమిషన్ సభ్యుల తనిఖీల్లో అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు, మహిళలకు అందించే ఆహారం నాణ్యత లేకపోవడం, నూనె, గుడ్లు వంటి స్టాక్ సక్రమంగా లేనట్లుగా గుర్తించారని, అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ ఇంత అధ్వానంగా ఉండటంపై ఐసిడిఎస్ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీ సూపర్‌వైజర్లు, సిడిపిఒలు సరైన పర్యవేక్షణ, తనిఖీలు లేకపోవడంతో ఇటువంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయని, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, సిడిపిఒలు అంగన్వాడీ కేంద్రాల తనిఖీలు చేసిన వివరాలను తనకు సమర్పించాలని కలెక్టర్ ఐసిడిఎస్ పీడీని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ, డిఇఒ వెంకటలక్ష్మమ్మ, ఐసిడిఎస్ పీడీ శారద, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ మూర్తి, డిఎస్ఒ విలియమ్స్, ఎంఇఒలు పాల్గొన్నారు.

నారాయణ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



ధర్నాలో నినదిస్తున్న నేతలు

విద్యార్థులను బూతులు తిడుతున్న నారాయణ కళాశాల డీన్ రమేష్‌ను సస్పెండ్ చేయాలని, కళాశాల భవనంలో అనుమతి లేకుండా నడుపుతున్న హైస్కూల్‌ను సీజ్ చేయాలనీ డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎన్ఆర్‌పేటలోని నారాయణ కళాశాల వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ నారాయణ జూనియర్ కళాశాలలో 10 నిమిషాలు లేటుగా వచ్చిన విద్యార్థులను కళాశాల డీన్ బూతులు తిట్టడం సరికాదన్నారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం కళాశాల ఉదయం 9 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా, నారాయణ జూనియర్ కాలేజీ ఉదయం 8 గంటలకే ప్రారంభిస్తున్నారని, విద్యార్థులు 8:15కి కళాశాలకు హాజరైతే ఎందుకు ఇంత లేట్ అయిందని విద్యార్థులను బూతులు తిట్టిన డీన్ రమేష్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. యాజమాన్యం డీన్‌పై చర్యలు తీసుకోకుండా విద్యార్థులను వేరొక బ్రాంచ్‌కి మార్చడం ఏమిటని ప్రశ్నించారు. అనుమతి లేకుండా జూనియర్ కళాశాలలో హైస్కూల్ నిర్వహిస్తున్నారని, ఈ విషయంపై గత సంవత్సరం నుండి విద్యాశాఖ అధికారులకు, ఆర్ఐఒకు అనేకసార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నారు. పైగా రాష్ట్రంలో వాళ్లదే అధికారం, కొంచెం ఆలోచించి జాగ్రత్తగా ఉండాలని విద్యాశాఖాధికారులు ఎస్ఎఫ్ఐ నాయకులకు బెదిరింపు ధోరణిలో చెప్పడం సరికాదన్నారు. విద్యాశాఖ అధికారులు ప్రభుత్వానికి భయపడ్డారా లేక లంచాలు తీసుకుని యాజమాన్యాన్ని వెనకేసుకొస్తున్నారా అని ఆయన ప్రశ్నించారు. ఉన్నతాధికారులు తక్షణమే ఇంతటి అవకతవకలకు పాల్పడుతున్న నారాయణ కళాశాలపై చర్యలు తీసుకోవాలని, కళాశాల గుర్తింపు రద్దు చేయాలని, డీన్ రమేష్‌ను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకుల ఫిర్యాదు మేరకు నారాయణ కళాశాలకు విచ్చేసిన ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి కె.యోహాన్ అక్కడికి చేరుకున్నారు. ఎస్ఎఫ్ఐ నేతలను చర్చలకు పిలిచారు. ఈ సందర్భంగా ఆర్ఐఒ మాట్లాడుతూ కళాశాలలో హైస్కూల్ తరగతులు నిర్వహిస్తున్న విషయం తాను గుర్తించానని, యాజమాన్యం ఒక రోజు సమయం కోరుతున్నారని, శనివారం సాయంత్రం లోగా ఇక్కడి నుంచి హైస్కూల్ తరగతులు తరలించకపోతే ఇంటర్మీడియట్ బోర్డుకు నివేదిక పంపి, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. అలాగే విద్యార్థులను బూతులు తిడుతున్న డీన్ రమేష్‌పై విచారణ చేసి చర్యలు తీసుకుంటానని తెలిపారు. దీంతో ఎస్ఎఫ్ఐ నాయకులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఏలూరు నగర ఉపాధ్యక్షుడు ఎం.జయంత్, ఎం.శివాజీ, ఎస్‌కె.మోక్షిత్, సిహెచ్.రాజు, కె.శివ, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



చర్చిస్తున్న ఆర్ఐఒ యోహాన్

గ్రామాల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలి

జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో గ్రామగ్రామాన గ్రంథాలయాలు ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ కోరారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు అధ్యక్షత వహించారు. తొలుత ముఖ్యఅతిథి ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి) జ్యోతి ప్రజ్వలన చేసారు. అనంతరం జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యదర్శి శేఖర్‌బాబు మాట్లాడుతూ 58వ గ్రంథాలయ వారోత్సవాలు జిల్లావ్యాప్తంగా 74 గ్రంథాలయాల్లో ప్రారంభమయ్యాయన్నారు. ఏలూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయం శిథిలావస్థకు చేరిన నేపథ్యంలో నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని, అంతవరకు వేరేచోటకు మార్చేందుకు సహకరించాలని ఎంఎల్ఎను కోరారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ మాట్లాడుతూ విద్యార్థులు ఫోన్‌తో కాకుండా పుస్తకాలతో గడిపినప్పుడే ఉన్నత శిఖరాలకు చేరుకోగలరరన్నారు. గ్రంథాలయాలకు తరచూ రావటం అలవాటుగా చేసుకుని మంచి విజ్ఞానవంతులు కావాలని విద్యార్థులకు సూచించారు. ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ ఫోన్ సినిమా వంటిదని, పుస్తకం జీవితం వంటిదని అన్నారు. త్వరలోనే గ్రంథాలయాన్ని తాత్కాలికంగా వేరేచోటకు తరలించి, నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి అన్ని చర్యలూ తీసుకుంటామని తెలిపారు. తొలుత వయోజన విద్య అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆర్.విజయ్‌కుమార్ గ్రంథాలయాలపై గీతం ఆలపించగా, కళారత్న అవార్డుగ్రహీత పార్వతీ రామచంద్రన్ శిష్యులచే స్వాగత నృత్యం ప్రదర్శించారు. సోషల్ వర్కర్ చలసాని వెంకటసురేంద్ర 'వెంట్రిలాక్విజం' (మాట్లాడే బొమ్మ)తో వినూత్న ప్రదర్శన ఇచ్చారు. కార్యక్రమంలో వయోజన విద్య ఉప సంచాలకులు జిసిహెచ్.ప్రభాకర్, టిడిపి నేత చోడే వెంకటరత్నం, శ్రీ సూర్య విద్యాసంస్థ డైరెక్టర్ కొండపల్లి చంద్రశేఖర్‌రావు, గ్రంథాలయ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్‌పి ఛైరపర్సన్ పద్మశ్రీ

మాక్ అసెంబ్లీకి వంశిక

ప్రజాశక్తి - లింగపాలెం



ఈ నెల 26న నిర్వహించే మాక్ అసెంబ్లీకి చింతలపూడి నియోజకవర్గం నుంచి లింగపాలెం మండలం వేములపల్లి గ్రామానికి చెందిన వంశిక ఎంపికైంది. చింతలపూడి ఎంఎల్ఎగా అసెంబ్లీకి వెళ్లడం ఎంతో అభినందనీయని సర్పంచి నత్త దీప్తి అన్నారు. మాక్ ఎంఎల్ఎగా తన ప్రతిభను కనపరచాలని ఆకాంక్షించారు. అసెంబ్లీకి వెళ్తున్న చిన్నారికి గ్రామం తరపున, గ్రామస్తుల తరపున గ్రామ పంచాయతీ తరపున శుభాకాంక్షలు తెలిపారు.


నేడు చింతకాయల బాబూరావు సంస్మరణ సభ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సిపిఎం ఏలూరు జిల్లా మాజీ కార్యదర్శి చింతకాయల బాబూరావు సంస్మరణ సభ 15వ తేదీ శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు ఏలూరులోని సిపిఎం జిల్లా కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాబూరావు సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యునిగా, అప్‌ల్యాండ్, ఏలూరు జిల్లా కార్యదర్శిగా, సిఐటియు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శిగా అటు పార్టీలోనూ, ఇటు సిఐటియులోనూ కీలక బాధ్యతలు వహించి పని చేశారని తెలిపారు. ఆయనకు గుండె ఆపరేషన్ జరిగిందని, ఇటీవల అనారోగ్య కారణాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అక్టోబర్ 30న మృతి చెందారని తెలిపారు. ఈ నేపథ్యంలోనే సిపిఎం జిలా కార్యాలయంలో సంస్మరణ సభ జరుగుతుందని చెప్పారు. ఈ సభకు వక్తలుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, సిపిఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ జిల్లా నాయకులు యువి, సిపిఐ (ఎంఎల్) జిల్లా నాయకులు ఎంఎస్.నాగరాజు, సిపిఐ (ఎంఎల్) ప్రజా పంథా జిల్లా కార్యదర్శి ఎస్‌కె.గౌస్, సిపిఐ (ఎంఎల్) రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి జె.వెంకటేశ్వరరావు, ఎంసిపిఐ (యు) జిల్లా కార్యదర్శి శావనపుడి నాగరాజు, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమొక్రసీ జిల్లా నాయకులు సాలి రాజశేఖర్ పాల్గొంటారని, ఈ కార్యక్రమానికి జిల్లాలోని సిపిఎం జిల్లా నాయకులు, ముఖ్య కార్యకర్తలు, సానుభూతిపరులు, ఇతర వామపక్ష పార్టీల నాయకులు తదితరులు హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలి

సిఐటియు ఆధ్వర్యాన వినతులు



టి.నరసాపురంలో...

ప్రజాశక్తి - టి.నరసాపురం


అంగన్వాడీ సెంటర్లను ప్రీ స్కూల్ పిల్లలతో బలోపేతం చేయాలని, ఆ మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి డివిఎన్.ప్రసాదరావు డిమాండ్ చేశారు. స్థానిక సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం అంగన్వాడీ కార్యకర్తలు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ పిల్లలు తగ్గిపోతున్నారన్న కారణం చూపి అంగన్వాడీ సెంటర్లను విలీనం చేయాలని ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు విరమించుకోవాలన్నారు. అంగన్వాడీ సెంటర్లలో ప్రీస్కూల్ బలోపేతం చేయాలంటే మూడు నుంచి ఆరేళ్ల లోపు పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లో నమోదయ్యేవిధంగా జిఒ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రీస్కూల్ పిల్లలకు తల్లికి వందనం అమలు చేయాలన్నారు. ఎస్ఆర్ఎస్ రద్దు చేయాలని పిల్లలకు ఇచ్చే మెనూ క్వాంటిటీ పెంచాలని ప్రీస్కూల్ పిల్లలకు యూనిఫామ్, టై, బెల్ట్, బూట్లు ఇవ్వాలని కోరారు. అంగన్వాడీలకు అదనపు పనులు అప్పగించరాదని ఆన్లైన్ వర్క్ తగ్గించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందించిన వారిలో సిఐటియు మండల కమిటీ సభ్యులు హనుమాన్, వెంకట మురళి, ఎన్.రఘూన్సీ, యు.శాంతకుమారి, కె.పాపయమ్మ, చంద్రకళ పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : అంగన్వాడీ సమస్యల పరిష్కరించాలని కోరుతూ బుట్టాయగూడెం మండలంలోని అన్ని సచివాలయాల్లో నిరసన తెలియజేసి అనంతరం సచివాలయ సెక్రటరీకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు నాగమణి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ పిల్లల తగ్గిపోతున్నారనే కారణం చూపి అంగన్వాడీ సెంట్రల్‌ను విలీనం చేయాలని ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ మండల నాయకులు కె.పుష్ప, నాగరత్న, తెల్లం రామలక్ష్మి, రామయమ్మ, సీత, జ్యోతి, సుధ, కృపమణి, నూర్జహాన్, ఆకాశమ్మ, వెంకయమ్మ, లక్ష్మి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

కుక్కునూరు రూరల్ : అంగన్వాడీ కేంద్రాలను ప్రభుత్వ పాఠశాలల్లో విలీనం ఆపాలని అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షులు కుంజ నాగలక్ష్మి అన్నారు. ఆంధ్రప్రదేశ్ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కుక్కునూరు మండలంలోని మారేడుబాక, ఉప్పేరు, అమరవరం, పేదరాయిగూడెం, కుక్కునూరు పలు సచివాలయాల్లో అంగన్వాడీలు సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి సచివాలయ కార్యదర్శులకు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా కుక్కునూరు ప్రాజెక్టు అధ్యక్షులు నాగలక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ పిల్లలు తగ్గిపోతున్నారని, ఈ కారణం చూపి అంగన్వాడీ సెంటర్లను విలీనం చేయాలని ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందన్నారు. ఈ ధర్నాలో అంగన్వాడీలు పాముల అన్నపూర్ణ, కారం వందన, రమాదేవి, ప్రభామణి, వీణ, దుర్గ, లక్ష్మీకాంత, భవాని, ఆర్‌వి.రమణ, తదితరులు పాల్గొన్నారు.



పోలవరంలో...



బుట్టాయగూడెంలో...

పోలవరం : రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ సెంటర్లను బలోపేతం చేయాలని, ప్రభుత్వం చేపడుతున్న విలీన ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి పిఎల్ఎస్.కుమారి సచివాలయ సెక్రటరీలకు వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు కె.దుర్గ, ఎం.దివ్య, ఎం.బుల్లమ్మ, టి.రామలక్ష్మి ,పి.సత్యవతి, విజయ, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.

వేలేరుపాడు : మండలంలోని రేపాకగొమ్ము పంచాయతీలో సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక సచివాలయ సెక్రటరీకి డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎస్.లత, ఎం.దుర్గారావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.ముత్తమ్మ, కుంజా రంగమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు జ్యోతి, శారద, సుజాత, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్



తనిఖీ చేస్తున్న అధికారులు

పట్టణ పరిధిలో ప్రాంతీయ రవాణా శాఖాధికారులు శుక్రవారం విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రవాణా శాఖాధికారులు అన్నపూర్ణ, కృష్ణవేణి మాట్లాడుతూ ట్యాక్స్ సకాలంలో చెల్లించని, ప్రథమ చికిత్స కిట్ లేని, ఎమర్జెన్సీ డోర్ లేకపోవడం, సీట్లను ఆల్టరేషన్ చేయడం, సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కించుకుని ఓవర్ లోడ్‌తో వెళ్లడం, లైసెన్స్ రెన్యువల్ కాకపోవడం వంటి కారణాలతో 15 వాహనాల యజమానులపై కేసులు నమోదు చేశామన్నారు. రెండు బస్సులను సీజ్ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని ధ్రువీకరణ పత్రాలు వెంట ఉండాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, ఫోర్ వీలర్స్ నడిపేవారు సీట్ బెల్ట్ వినియోగించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠినంగా వ్యవహరించడంతోపాటు శిక్షలు, భారీ జరిమానాలు తప్పవని హెచ్చరించారు.

సార్వా వరి కోతలు ప్రారంభం

ప్రజాశక్తి - ముదినేపల్లి



వరి కోతలో కూలీలు

మండలంలోని పలు గ్రామాల్లో సార్వా వరి కోతలు ప్రారంభమయ్యాయి. ముందుగా నాట్లు వేసిన చేలు కోతకు రావడంతో రైతులు కోతలు ప్రారంభించారు. మండలంలోని గరువు గ్రామాల్లో ప్రస్తుతం కోతకు వచ్చిన చేలను యంత్రాలతో, కూలీలతో రైతులు కోతలు కోయిస్తున్నారు. మండలంలోని చిగురుకోట, పెదకామనపూడి, బొమ్మినంపాడు, చినకామనపూడి, అల్లూరు, ముదినేపల్లి, సింగరాయపాలెం తదితర గ్రామాల్లో వరి కోతలు ప్రారంభమయ్యాయి. రైతులు నూర్పిడి చేసిన ధాన్యాన్ని విక్రయించేందుకు మండలంలో రెండు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. వడాలి, బొమ్మినంపాడులో అధికారులు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ప్రస్తుతం మండలంలో వరి కోతలు ప్రారంభం కావడంతో గ్రామాల్లో కూలీల సందడి ఏర్పడింది. ఈ నెలాఖరుకు వరికోతలు ముమ్మరమయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి.

'సామాజిక సేవలో ఉప్పలపాటి గణేష్'



ప్రజాశక్తి - ముసునూరు

గోపవరం టిడిపి అధ్యక్షులు, గోపవరం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సొసైటీ అధ్యక్షులు ఉప్పలపాటి గణేష్ సేవా దృకథంతో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయన గత 24 రోజులుగా అయ్యప్ప, భవాని మాలాధారులకు ప్రతిరోజూ మధ్యాహ్నం భిక్ష (భోజనం), రాత్రికి అల్పాహారం (చద్ది) పెడుతున్నారు. ఇలా ఒకవైపు సేవా కార్యక్రమాలు చేయడంతోపాటు గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నారు. రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సౌజన్యంతో సొసైటీ ద్వారా రైతులకు సకాలంలో రుణాలు అందిస్తున్నారు. సొసైటీ ద్వారా పలు పథకాలు రైతులకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. అదేవిధంగా పశువైద్యశాల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాలు, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టారు. పలు అభివృద్ధి కార్యక్రమాలతోపాటు సామాజిక సేవా కార్యక్రమాలు ముందుకు తీసుకెళ్లడమే తన లక్ష్యమని ఉప్పలపాటి గణేష్ తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - చింతలపూడి

విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.మధుబాబు తెలిపారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఒ టి.సత్యవతి, చింతలపూడి సిఐ టి.కాంత్‌కుమార్, స్కూల్ డెవలప్‌మెంట్ సుధాకర్ న్యాయవాదులు డేవిడ్ రాజు, ఉమర్, ఫారూఖ్, కెకె.దుర్గాభవాని సోషల్ వర్కర్ ఎండి అక్బర్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి బిసి సెల్ నగర అధ్యక్షులుగా మనోహర్



ప్రజాశక్తి - ఏలూరు

వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి, సంక్షేమానికి కృషి చేస్తానని టిడిపి బిసి సెల్ నగర అధ్యక్షులు తంగేటి మనోహర్ తెలిపారు. శుక్రవారం టిడిపి బిసి సెల్ నగర అధ్యక్షులుగా తంగేటి మనోహర్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మనోహర్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ స్థాపించిన నాటి నుంచి నేటి వరకు బిసిలు వెన్నుముఖగా ఉన్నారన్నారు. తనకు తోడుగా ఉన్న కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి కొయ్యలగూడెం

ప్రతి శుక్రవారం టిడిపి ఎంఎల్ఎలు, ఇన్‌ఛార్జులు ప్రజలకు అందుబాటులో ఉండేందుకు గ్రీవెన్స్ (ప్రజాదర్బార్) నిర్వహించాలని రాష్ట్ర ట్రైకర్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆకుల అరుణ, ఏలూరు పార్లమెంట్ మహిళా అధికార ప్రతినిధి జారం చాందిని తదితరులు హాజరయ్యారు.

నాలుగు వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

స్వచ్ఛత ఉద్యమి యోజనలో భాగంగా ఎన్ఎస్‌కెఎఫ్ డిసి పథకం నిధులతో స్వచ్ఛంద్రా కార్పొరేషన్, ఎస్‌సి కార్పొరేషన్ సమన్వయంతో మున్సిపల్ కార్పొరేషన్, ఏలూరుకు కేటాయించిన నాలుగు మురుగు శుద్ధి వాహనాలు వాయిదాలు చెల్లించకపోవడంతో అధికారులచే స్వాధీనం చేసుకున్నారు. 2024లో ఐదుగురు సభ్యులతో కూడిన ప్రతి గ్రూపునకు ఒక్క వాహనం చొప్పున మొత్తం నాలుగు వాహనాలను మంజూరు చేసి లబ్ధిదారులకు పంపిణీ చేసిన విషయం తెలిసిందే. అయితే, ఈ లబ్ధిదారులు ఎస్‌సి కార్పొరేషన్‌కు చెల్లించాల్సిన నెలవారీ వాయిదాలను నిరంతరంగా చెల్లించకపోవడంతో, పలుమార్లు ఫోన్ ద్వారా గుర్తుచేసినా, నోటీసులు జారీ చేసినా స్పందన లేకపోవడంతో అధికారులు చర్యలు తీసుకున్నారు. 48 గంటల్లోగా బకాయి వాయిదాలు మొత్తం చెల్లించిన పక్షంలో వాహనాలను తిరిగి అందిస్తామని ఎస్‌సి కార్పొరేషన్ స్పష్టం చేసింది.

రాష్ట్రస్థాయిలో భార్గవి ప్రతిభ

ప్రజాశక్తి - చింతలపూడి

పట్టణానికి చెందిన భార్గవి ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి డిస్కస్ త్రో లో ప్రతిభ కనబరిచి బ్రౌంజ్ మెడల్ సాధించింది. ఈ సందర్భంగా ఆమెకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

విద్యతోనే లక్ష్య సాధన సాధ్యం

ప్రజాశక్తి - టి.నరసాపురం

విద్యార్థులు తమ లక్ష్యాన్ని సాధించడానికి విద్య ఎంతగానో దోహదపడుతుందని జిల్లా బాలల సంరక్షణ యూనిట్ కార్యాలయం ఇన్‌స్టిట్యూషనల్ కేర్ ప్రొటెక్షన్ అధికారి సిహెచ్.శ్రీకాంత్ అన్నారు. స్థానిక హైస్కూలులో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి ఆధ్వర్యంలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఐసిడిసి సెక్టార్ సూపర్‌వైజర్ టి.లక్ష్మి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం బి.లింగస్వామి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

శీతాకాల వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు

శీతాకాలం ప్రభావంతో చిన్నపిల్లలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. స్థానిక పవర్‌పేట పట్టణ ఆరోగ్య కేంద్రం పాండురంగాపురం పరిధిలో డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు చలి వాతావరణంలో సంభవించే సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పవర్ పేట పట్టణ ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ గౌతమ్, హెల్త్ సూపర్‌వైజర్ ఝాన్సీ, హెల్త్ అసిస్టెంట్ మణికుమార్, మేకా శ్రీనివాసరావు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు



బియ్యం స్వాధీనం చేసుకున్న అధికారులు

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - కామవరపుకోట

రేషన్ బియ్యం అక్రమంగా రవాణా జరుగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు మండలంలోని తడికలపూడిలో శివారు రహదారిలో వ్యాన్ ఆపి విజిలెన్సు, రెవెన్యూ, పౌర సరఫరా అధికారులు సంయుక్తంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో 43.40 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమంగా రవాణా జరుగుతున్నట్లు గుర్తించి డ్రైవర్‌ను ప్రశ్నించారు. తడికలపూడికి చెందిన ఈడుపుగంటి శ్రీనివాసరావుకు చెందిన పాత రైస్ మిల్లులో తడికలపూడి పరిసర ప్రాంతాల్లో రేషన్ కార్డు దారుల వద్ద కిలో రు.15లకు కొనుగోలు చేసి వాటిని పిఠాపురం మండలం, బి.ప్రత్తిపాడు గ్రామానికి చెందిన చోడిశెట్టి మహేష్, చోడిశెట్టి సతీష్‌లకు కిలో రు.22లకు అమ్ముతున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో రూ.1,73,600 విలువైన బియ్యం, వాహనం సీజ్ చేసి ఈడుపుగంటి శ్రీనివాసరావు, చోడిశెట్టి మహేష్, చోడిశెట్టి సతీష్, డ్రైవర్ ఒబిలిశెట్టి వెంకట సూర్యనారాయణలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్సు ఎస్ఐ సిహెచ్.రంజిత్‌కుమార్, రెవెన్యూ, పౌర సరఫరా అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



పోలవరంలో...

ప్రజాశక్తి - పోలవరం

చిన్నారుల శక్తివికాసానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తుందని రాష్ట్ర ట్రైకర్ కార్పొరేషన్ ఛైర్మన్, టిడిపి పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొరగం శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని కృష్ణారావుపేట సొసైటీ ఆవరణలో నిర్వహించిన బాలల దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం సొసైటీలో ఏర్పాటు చేసిన కొత్త లాకర్ల ప్రారంభోత్సవంలో శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు కొణతాల ప్రసాద్, నీటిపారుదల సంఘం అధ్యక్షులు పాదం ప్రసాద్, విద్యార్థులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ శుక్రవారం ఏలూరు రూరల్ శనివారపు పేటలోని ప్రభుత్వ బాలుర వసతి గృహంలో బాలల దినోత్సవ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.రచన, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు రాజేంద్రప్రసాద్, సిడబ్ల్యుసి ఇన్‌ఛార్జి ఛైర్మన్ పి.వెంకటేశ్వరరావు, సిడబ్ల్యుసి సభ్యులు రాజేశ్వరరావు, వసతి గృహ పర్యవేక్షకురాలు శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు. అనంతరం దొండపాడు లోని పరివర్తన బంధిరుల పాఠశాలలో నిర్వహించిన బాలల దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు.

భీమడోలు : జ్ఞాన వికాసానికి, సామాజిక చైతన్యానికి నిరంతర పుస్తక పఠనం అవసరమని, దీనికి గ్రంథాలయాలు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నాయని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. మండలంలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల కేంద్రాలకు చెందిన తెలుగు జ్ఞాన విజ్ఞాన సమాచార కేంద్రాల్లో శుక్రవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఆయా గంథపాలకులు శ్రీనివాసరావు, నాగమణి, అమర్‌నాథ్ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. భీమడోలు నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉంగుటూరు ఎంఎల్ఎ హాజరయ్యారు. గ్రంథాలయ వారోత్సవాలతోపాటు, బాలల దినోత్సవం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమానికి భీమడోలు శాఖ గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ టివి.ఉమామహేశ్వరరావు, సామాజిక కార్యకర్త మండే సుధాకర్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో భాగంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు శతక పద్యాల పోటీలు, వందేమాతరం గీతాలాపన పోటీలను గ్రంథ పాలకులు నిర్వహించారు. విజేతలకు ఎంఎల్ఎ గ్రంథాలయం తరుపున ప్రోత్సాహక బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు, కూటమి నాయకులు శేషగిరి, కరణం పెద్దిరాజు, పత్తి మదన్, పుల్లయ్య నాయుడు, కె.ప్రసాద్, సత్యసాయి, ఆదిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

ముదినేపల్లి : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ ముదినేపల్లి శాఖ గ్రంథాలయంలో శుక్రవారం ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల నైపుణ్యం పెంపొందించేందుకు జిల్లా గ్రంథాలయం సంస్థ సరఫరా చేసిన నూతన కంప్యూటర్లను ప్రారంభించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముదినేపల్లి సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ, ఎన్‌డిఎ నాయకులు పాల్గొన్నారు.

ఏలూరు సిటీ : ఏలూరు ప్రాజెక్టు పరిధిలో మొదటి సెక్టార్ శివగోపాలపురం అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం బాలల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రాజెక్ట్ డైరెక్టర్ శారద హాజరయ్యారు. పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు వారి చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మంగా, అంగన్వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.



దెందులూరులో...

చింతలపూడి : చింతలపూడి గ్రంథాలయంలో నిర్వహించిన కార్యమ్రంలో పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి ఎంఎల్ఎ రోషన్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక రూపంలోనే కాకుండా మారుతున్న కాలానుగుణంగా డిజిటల్ లైబ్రరీల ఏర్పాటుకు ప్రభుత్వం ద్వారా కృషి చేస్తానన్నారు. అనంతరం గ్రంథాలయ ఛైర్మన్‌గా అనిల్ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కమిటీ ఛైర్మన్ చీదరాల దుర్గాపార్వతి, మాజీ ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు, యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని మండల విద్యాశాఖాధికారిణి ఎస్.కళ్యాణి తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నెహ్రూ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులకు మొదటి రోజు చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. అనంతరం గ్రంథాలయ పాలకులు ఆర్.కిషోర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో మెట్ట గూడెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు తిరివీధుల పూర్ణచంద్ర రావు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

పోలవరం : పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలల దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్.సత్యనారాయణ, ఉపాధ్యాయులు కె.లక్ష్మీకాంతం తెలిపారు. వివిధ రకాల పోటీలను నిర్వహించగా, వాటిలో విజేతలైన విద్యార్థులకు ఉపాధ్యాయుల చేతుల మీదుగా బహుమతులు అందించారు.

నూజివీడు టౌన్ : పట్టణంలోని యానాదుల కాలనీలో ఉన్న ఎపియుపి స్కూల్లో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సులో బాలల దినోత్సవం నిర్వహించారు. పండిట్ జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్స్ ఎస్‌కెడి.ప్రసాద్, గోపీనాథ్, పాఠశాల హెచ్‌ఎం పద్మజ, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ముసునూరు : జవహర్‌లాల్ నెహ్రూ 136వ జయంతి వేడుకలు అంగన్వాడీ కేంద్రం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నెహ్రూ జీవిత చరిత్రపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, తహశీల్దార్ డి.ప్రశాంతి, ఎంపిడిఒ పిల్లి ఏసుబాబు, ఉప ఎంపిడిఒ బసవరాజు సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్స్ శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ సామ్యూల్, అంగన్వాడి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి : గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ ఎల్‌విఎస్.రామకృష్ణ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో తొలుత అయ్యంకి వెంకటరమణయ్య, జవహర్ లాల్ నెహ్రూ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు పద్యాల పోటీలు నిర్వహించినట్లు శాఖా గ్రంథాలయాధికారి జె.రమేష్‌బాబు తెలిపారు. నాయకులు మసిముక్కు వెంకటేశ్వరరావు, నున్న రమాదేవి, ఉపాధ్యాయులు సాగర్, రమణి, గోపాలకృష్ణ, టెన్నిసన్, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

దెందులూరు : పెదవేగి మండలం ఎంపిపిఎస్ రామసింగవరం పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పిల్లలందరికీ ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. పిల్లల సాంస్కృతిక నృత్యాలు అందర్నీ అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుంటూరు శ్రీనివాసరావు మాట్లాడుతూ బాలల దినోత్సవం గొప్పతనాన్ని విద్యార్థులకు తెలిపారు. హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు టివి.పద్మావతి చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పరసా నాగర్జున, లక్ష్మీనారాయణ, ఇ.శ్రీనివాసరావు, జి.శ్రీనివాసరావు, లాజర్ మాస్టారు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



కలిదిండిలో...

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - చింతలపూడి

ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా వ్యవసాయాధికారి అమిబ్ భాషా అన్నారు. మండలంలో రాఘవపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రాలకు బస్సులు ఏర్పాటు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కార్తీక మాసం సందర్భంగా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా యాత్రికుల సౌకర్యార్థం పంచారామ క్షేత్రాలు దర్శనానికి ప్రతి ఆదివారం రాత్రి సెమీ లగ్జరీ, సూపర్ లగ్జరీ బస్సులు ఏర్పాటు చేసినట్లు, ఈ ఏడాది ఆఖరి సోమవారం 17వ తేదీ అయినందున 16వ తేదీ రాత్రి జిల్లా వ్యాప్తంగా ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోల నుంచి పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రజారవాణా అధికారి ఎస్‌కె.షబ్నం తెలిపారు. బస్సుల కోసం గురు స్వాములు సమీప డిపోల్లో సంప్రదించవచ్చుని, మార్కెటింగ్ సెల్ నెంబర్ 9346767670 సంప్రదించవచ్చని తెలిపారు.

రైతులు అధైర్య పడొద్దు

ప్రజాశక్తి - ముదినేపల్లి

రైతులు అధైర్య పడవద్దని, ప్రతి రైతుకూ న్యాయం జరిగేలా చూస్తామని ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ అన్నారు. మండలంలోని బొమ్మినంపాడులో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రం, వరి పొలాల్లో వాడే స్ప్రే మెషిన్‌ను ప్రారంభించారు.

నీరు నిల్వ లేకుండా చూడాలి

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం మండలం జగన్నాథపేటలో వింజరం పిహెచ్‌సి వైద్య సిబ్బంది శుక్రవారం ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటి పరిసరాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, కొబ్బరి బోండాలు, పాత టైర్లలో నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు విస్తరిచి డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వనీరు పూర్తిగా తొలగించాలని సూచించారు.

యుటిఎఫ్‌ను బలోపేతం చేయాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండల వ్యాప్తంగా యుటిఎఫ్ సంఘాన్ని బలోపేతం చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి అల్లాడి రాజు అన్నారు. స్థానిక రామన్నపాలెం పాఠశాల ఆవరణలో యుటిఎఫ్ మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి అల్లాడి రాజు మండల మాట్లాడుతూ మండల వ్యాప్తంగా యుటిఎఫ్ సంఘాన్ని బలోపేతం చేయాలన్నారు. అనంతరం నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ప్రెసిడెంట్‌గా మడకం పోశమ్మ, సెక్రటరీగా నూతి చెన్నారావు, అసోసియేషన్ అధ్యక్షులుగా ఆర్.సోమేశ్వరరావు, పైదా వెంకటలక్ష్మిలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

70 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - కామవరపుకోట

జంగారెడ్డిగూడెం పివిఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారిచే తాడిచర్ల పసుమర్తి పార్థసారథి బాబు ఆధ్వర్యంలో తాడిచర్లలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 70 మంది రోగులకు ఉచితంగా ఇసిజి, ఎకో పరీక్షలు, షుగర్, బిపికి సంబంధించి న పరీక్షలు నిర్వహించారు. రోగులకు డాక్టర్ గోపిరెడ్డి గుండె జబ్బులు రాకుండా తగు జాగ్రత్తలు చెప్పడమే కాకుండా గుండెనొప్పి వచ్చినపుడు సత్వరమే తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకుడు కిలారు సత్యనారాయణ, తాడిచర్ల గ్రామ కమిటీ అధ్యక్షుడు వేముల హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి రాయపాటి పద్మ శేఖర్ పివిఆర్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

'బిల్డింగ్ పీనలైజేషన్'ను వినియోగించుకోండి



ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణ పరిధిలో బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్‌ను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కె.వీరయ్య తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీ లోపు నిర్మించిన అనుమతి లేని భవనాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. నిబంధనల మేరకు పీనలైజేషన్ ఛార్జీలు చెల్లించి, విచారించిన మీదట క్రమబద్ధీకరించడం జరుగుతుందని వివరించారు. నివాస, నివాసేతర భవనాలను క్రమబద్ధీకరించుకునే గొప్ప అవకాశం లభించిందన్నారు. బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ 2025 కింద మున్సిపల్ కార్యాలయంలో ఆన్‌లైన్ ద్వారా, వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

మధుమేహంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రపంచ మధుమేహ నివారణ దినోత్సవం సందర్భంగా పవర్‌పేట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యుపిహెచ్‌సి)లో అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిఎంహెచ్‌ఒ డాక్టర్ జాన్ అమృతం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మధుమేహం నివారణకు తీసుకోవాల్సిన ఆహార నియమాలు, వ్యాయామ ప్రాముఖ్యత, బరువు నియంత్రణ వంటి అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఒ డాక్టర్ గంగాభవాని, ఎన్‌సిడి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నరేంద్ర కృష్ణ, డాక్టర్ పూజా, డాక్టర్ ట్వింకిల్, యుపిహెచ్‌సి డాక్టర్ గౌతమ్

నూజివీడు టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆవరణలో ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.పద్మజారాణి, ఆర్‌ఎంఒ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూప్రతి ఒక్కరిలో మధుమేహంపై అవగాహన పెంపొందాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే మందులు ఉచితంగా అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే సహకార సంఘాల లక్ష్యం



జెండా ఎగురవేస్తున్న ప్రముఖులు

ప్రజాశక్తి - టి.నరసాపురం

రైతుల సంక్షేమమే సహకార సంఘాల ప్రధాన లక్ష్యమని మక్కినవారిగూడెం సొసైటీ ఛైర్‌పర్సన్ ఆచంట సూర్యనారాయణ అన్నారు. 72వ అఖిల భారత సహకార వారోత్సవాలను పురస్కరించుకుని మక్కినవారిగూడెం సొసైటీ ఆవరణలో శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో ఛైర్మన్ ఆచంట సూర్యనారాయణ జెండా ఆవిష్కరించి వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ఆర్థికాభివృద్ధికి సహకార సంఘాలు తోడ్పాటును అందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సిఇఒ యువివి.సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

సమస్యల రహిత నియోజకవర్గంగా ఏలూరును తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎంఎల్ఎ బడేటి చంటి స్పష్టం చేశారు. అలాగే నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రభాగంలో నిలుపుతానని వెల్లడించారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ప్రజాదర్బార్ దోహదపడుతుందని చెప్పారు. ఏలూరులోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ముఖ్యంగా గృహ లబ్ధిదారుల వినతులను స్వీకరించి వారి సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. అనంతరం ఆయా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్ డే నిర్వహించి, ప్రజల సమస్యలను స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా దర్బార్ పని చేస్తుందని చెప్పారు. ముఖ్యంగా వివిధ పథకాల లబ్ధిదారులకు ఎదురయ్యే సమస్యలకు సత్వర న్యాయం అందించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ప్రధానంగా అర్హత కలిగిన గృహ లబ్ధిదారులకు న్యాయం చేయడంతో పాటు గత వైసిపి ప్రభుత్వ హయాంలో అర్హులై ఉండికూడా పెన్షన్‌లు నిలిపివేయబడిన వారికి పెన్షన్లను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు.



పాలవ్యాన్ ఢీకొని ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

పాల వ్యాన్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఘటనలో ఇద్దరు దుర్మరణం పాలైన ఘటన గురువారం రాత్రి వడ్లమాను గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నూజివీడుకు చెందిన దొడ్డపనేని రామకృష్ణ (60), బరోతు కోటేశ్వరరావు (38) గురువారం విజయవాడలో తమ పనులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై గురువారం రాత్రి విజయవాడ నుంచి నూజివీడు బయల్దేరారు. మండల పరిధిలోని వడ్లమాను గ్రామ సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా వచ్చిన పాల వ్యాన్ వీరిని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో దొడ్డపనేని రామకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలపాలైన బరోతు కోటేశ్వరరావును నూజివీడు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఆగిరిపల్లి ఎస్ఐ కె.శుభశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రంథాలయ కమిటీ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణంలో స్థానిక గ్రంథాలయ నూతన కమిటీ చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేయించారు. గ్రంథాలయ ఛైర్మన్‌గా కొప్పాక శ్రీనివాసరావు, డైరెక్టర్లుగా ఇనుముల వెంకట పాపారావు, ధోసూరి సుబ్బారావు ,చింతల శ్రీను, గుళ్లపూడి కామరాజు, గంగిరెడ్ల దుర్గ, ముత్యాల వెంకటలక్ష్మి గాయత్రి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ ఛైర్మన్ కొప్పాక శ్రీనివాసరావు మాట్లాడారు.